భైంసా: డప్పు మేళాలతో వెళ్తున్న గ్రామస్తులు

నిర్మల్ అర్బన్: రంగులు చల్లుకుంటున్న మహిళలు

భైంసా: నృత్యాలు చేస్తున్న మార్వాడీ సమాజ్ సభ్యులు

భైంసా: నృత్యాలు చేస్తున్న మార్వాడీ సంఘం మహిళలు

సోన్: కూచన్‌పల్లిలో హోలీ ఆడుతున్న యువకులు

దస్తురాబాద్ : నాయకులతో కలిసి హోలీ సంబురాలను జరుపుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు

రంగ్..రంగ్..హోలీ

- సందడి చేసిన చిన్నారులు, యువత
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నిర్మల్ అర్బన్, మార్చి 25 : పట్టణంలోని శాంతినగర్ కాలనీ, వెంకటాపూర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఏఎన్ రెడ్డి కాలనీ, శాస్త్రినగర్, శ్రీనగర్ కాలనీ, ప్రియదర్శిని నగర్, బంగల్‌పేట్ కాలనీతో పాటు అన్ని వార్డుల్లో సోమవారం హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నాపెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

నర్సాపూర్(జీ), మార్చి 25: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఒకటో వార్డు మల్లికార్జున కాలనీలో రంగులతో నింపిన కుండలను ఉట్టిలతో కట్టి పగులగొట్టారు. ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన గోగుపువ్వుతో తయారు చేసిన రంగులను చల్లుకున్నారు. హోలీ సంప్రదాయ పాటలకు యువకులు, యువతులు నృత్యాలు చేశారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ చిన్న రామయ్య, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, నాయకులు కొండ్ర రమేశ్, ఇంద్రకరణ్ రెడ్డి, ఆయా గ్రామాల్లో నాయకులు, మల్లికార్జున కాలనీలో రంజిత్, రవి, నగేశ్, సతీశ్, అల్లాడి రవి పాల్గొన్నారు.

భైంసా/భైంసాటౌన్, మార్చి 25 : పట్టణంలోని కిసాన్ గల్లీ, నేతాజీ నగర్, భట్టిగల్లీ, రాహుల్ నగర్, పులే నగర్, మర్వాడీ గల్లీ, తదితర కాలనీలు, మండలంలోని గ్రామాల్లో ఆనందోత్సాహాలతో ప్రజలు హోలీ సంబురాలు చేసుకున్నారు. కిసాన్‌గల్లీ వాసులు డప్పుమేళాలతో శోభాయాత్రగా వెళ్తు ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు. అదే విధంగా ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు పలువురు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ గల్లి సర్పంచ్ అల్లకొండ సాయినాథ్, ఉపసర్పంచ్ గట్టు, కోశాధికారి కాశీనాథ్, మాజీ సర్పంచ్‌లు కుంట రాజలింగు, కోర్వ చిన్నన్న పాల్గొన్నారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, పట్టణ సీఐ రాజారెడ్డి ఆయా కూడళ్లలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

ముథోల్, మార్చి, 25 : ముథోల్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ ఆనందంగా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నిర్మల్ టౌన్, మార్చి 25 : పట్టణంలోని టీన్జీజీవోస్ కార్యాలయంలో ఉద్యోగులు ఒకరినొకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం అధికారులను కలిసి హోలి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవికుమార్, ఉద్యోగులు మొహన్‌రెడ్డి, సరేందర్, అశోక్ ఉన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ప్రియదర్శిని నగర్, టీయూటీఎఫ్ కార్యాలయంలో రంగులు పూసుకొని హోలి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు రవికాంత్, మురళీ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

సోన్, మార్చి 25 : నిర్మల్ మండలం వెంగ్వాపేట్, చిట్యాల్, డ్యాంగాపూర్, అక్కాపూర్, నీలాయి పేట్, మేడిపల్లి, ముజ్గి, సోన్ మండలంలోని మాదాపూర్, అక్కాపూర్, సాకెర, కూచన్‌పల్లి గ్రామాల్లో పండుగను ఘనంగా నిర్వహించారు.

శభాష్ వర్షిత్...

నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన కొప్పుల వర్షిత్ అనే బాలుడు తండ్రి లింగన్నతో గోగుపూలతో తయారు చేసిన రంగులను చల్లుతూ ఆదర్శంగా నిలిచాడు. బాలుడు వర్షిత్ తన తండ్రితో మోదుగ చెట్టుకు పూసే గోగుపూలను తెప్పించి ఇంటి వద్ద తన స్నేహితులతో కలిసి హోలీని జరుపుకున్నాడు.

దస్తురాబాద్/పెంబి/ సారంగాపూర్/తానూర్/లక్ష్మణ చాంద/ కడెం, మార్చి 25 : దస్తురాబాద్, పెంబి, సారంగాపూర్, తానూర్, లక్ష్మణచాంద, కడెం మండలాల్లోని గ్రామాల్లో హోలీ వేడుకలు నిర్వహించారు. గ్రామాల్లో చిన్నారులు, యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ సంబురాలు చేసుకున్నారు.తానూర్ మండలంలోని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ లోకం సందీప్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. దస్తురాబాద్ మండలం మున్యాల గొండు గూడెంలో దాత నాగు స్వామి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

హోలీ సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

దస్తురాబాద్,మార్చి 25 : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జుపటేల్ కల్లూర్ గూడలోని స్వగ్రామంలోని ఇంటి వద్ద దస్తురాబాద్ మండల నాయకులతో ఆయన హోలీ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేకు నాయకులు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షుడు పొద్దూటూరి సతీశ్ రెడ్డి, కిసాన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, మండల్యాక్షుడు దుర్గం మల్లేశ్, యూత్ అధ్యక్షుడు గుండా నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్ టౌన్: హోలీ సంబురాలు జరుపుకుంటున్న ఉద్యోగులు

నర్సాపూర్(జీ): మల్లికార్జున కాలనీలో ...

దస్తురాబాద్ : మున్యాలగొండు గూడెంలో..

సమీకృత మార్కెట్ నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

- భవనంలో అసంపూర్తిగా కూరగాయలు, మాంసం విక్రయ స్టాల్స్ పనులు
- అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న చిరు వ్యాపారస్తులు

ఖానాపూర్, మార్చి 25 : ఖానాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం 2022లో రూ. 3.90 కోట్లు మంజూరు చేసింది. పట్టణ ప్రజలకే కాకుండా నియోజకవర్గంలోని కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల ప్రజలకు నిత్యం అన్ని రకాల కూరగాయలు, మాంసం, పాలు, పండ్లు, పూలు విక్రయానికి స్టాల్స్ నిర్మించాలని ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా పనులు చేపట్టారు. ప్రాణాళిక ప్రకారం తగిన నిర్మాణం 50 శాతం పూర్తి కాగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పనులు అసంతృప్తిగా నిలిచిపోయాయి. అప్పటి మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్‌పై అవిశ్వాసం నెగ్గడంతో ఆరు నెలలుగా పనులు నిలిచిపోయాయి. స్టాల్స్ నిర్మాణ పనులు మధ్య దశలోనే ఉన్నాయి.

అసంతృప్తిగా పనులు

ఖానాపూర్–మెట్‌పల్లి రహదారి పక్కన 32 గుంటల విస్తర్ణంలో నిర్మిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులు లభించేలా శాఖాహారం కోసం 26 స్టాల్స్, మాంసాహారం కోసం 24 స్టాల్స్ మొత్తం 50 స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలి. సరుకులు కొనుగోలు చేయడానికి రానున్న ప్రజలకు తాగునీటి వసతితో పాటు మూత్రశాలల సదుపాయాలు, వాహనాలు నిలిపే ప్రదేశం, సరుకులు దించడానికి, ఎత్తడానికి అవసరమైన వేదిక ఏర్పాటు చేయాలి. దీంతో అధునాతన సదుపాయాలతో ఒకే ప్రాంగణంలో సమీకృత మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని వ్యాపారస్తులు, ప్రజలు కోరుతున్నారు.

మధ్య దశలో నిలిచిపోయిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

35 ఏండ్లుగా రోడ్లపై కూరగాయలు అమ్ముతున్నా

నేను 35 సంవత్సరాల నుంచి ఖానాపూర్‌లో రోడ్లపైన కూరగాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. సమీకృత మార్కెట్ నిర్మాణం చేపడుతున్నారని తెలిసి 2022లో సంబురంగా ఉండే కాని మధ్యలోనే నిలిపి వేయడంతో నిరాశ చెందాను. మార్కెట్ పనులను త్వరగా పూర్తి చేసి మా లాంటి చిరు వ్యాపారులకు అందుబాటులోకి తీసుకువస్తే మేలు జరుగుతుంది. అప్పుడే రోడ్లపై వ్యాపారం చేసే వారి బాధలు తొలగుతాయి. ఒకే చోట కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు లభించడంతో వినియోగదారులకు సైతం సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు గడువులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

-బల్గం భీమక్క, కూరగాయల వ్యాపారి, ఖానాపూర్

పనులు గడువులోగా పూర్తి చేయాలి

సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తి కాక పోవడంతో మున్సిపాలిటీలో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలోని పాత బస్టాండు, అటవీ శాఖ కార్యాలయం, ప్రభుత్వ దవాఖాన ఎదుట నిత్యం కూరగాయలు, పండ్ల వ్యాపారులు రోడ్లపైన అమ్ముకుంటున్నాం. రోడ్లపై అమ్మడంతో ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండు చుట్టూపక్కల ప్రాంతంలోని చిరు వ్యాపారులతో భారీ వాహనాలకు సైతం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. సమీకృత మార్కెట్ అందుబాటులోకి వస్తే పట్టణంలో పారిశుధ్యం మెరుగుపడి వాహనదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

-ఎనుగందుల గంగనర్సు, చిరు వ్యాపారి, ఖానాపూర్

డ్రైనేజీ నీటిని దారి మళ్లిస్తాం

బొడ్డొనికుంటలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న చైర్మన్ రాజురా సత్యం

ఖానాపూర్, మార్చి 25 : పట్టణంలోని శాంతినగర్ కాలనీకి అనుకొని ఉన్న బొడ్డొని కుంట పరిసర ప్రాంతాలను సోమవారం చైర్మన్ రాజురా సత్యం పరిశీలించారు. కాలనీ ప్రజలు ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో దుర్వాసన వస్తున్నట్లు ఫిర్యాదు చేయగా స్పందించారు. బొడ్డొనికుంట ఆవరణలో కొంతకాలంగా పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. పలు వార్డుల మురుగునీరు కుంటలోకి రాకుండా ఇతర ప్రాంతానికి తరలించేలా మళ్లిస్తామని అన్నారు. మున్సిపల్ వాహనంలో చెత్త వేయాలని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినట్లయితే మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ సంతోష్, కమిషనర్ మనోహర్, వార్డుల ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పోచమ్మ ఆలయంలో బోర్ ఏర్పాటు


: పోచమ్మ ఆలయం వద్ద బోరు వేయిస్తున్న మారవేణి శేఖర్

దస్తురాబాద్, మార్చి 25 : మండల కేంద్రానికి చెందిన మారవేణి రాజారెడ్డి జ్ఞాపకార్థం ఆయన చిన్న కుమారుడు మారవేణి శేఖర్ భూత్కూర్ గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో తన సొంత నిధులతో బోరు వేయించి ఉదారతను చాటుకున్నాడు. నిత్యం ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. వారి సౌకర్యార్థం తాగునీరు అందించేందుకు తన తండ్రి జ్ఞాపకార్థం ఉచితంగా బోర్ వేయించినట్లు శేఖర్ తెలిపారు. శేఖర్‌కు అమ్మవారి భక్తురాలు మారాజు పోశవ్వ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వర్ణ నంది పురస్కారం అందుకున్న సరిత

నిర్మల్ అర్బన్, మార్చి 25 : నిర్మల్‌కు చెందిన అనంతుల సరిత రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబర్చి స్వర్ణనంది పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. నిర్మల్ నుంచి నృత్యమాల అకాడమీ తరపున సరిత పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రదర్శన చేసిందుకు గాను పురస్కారం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ప్రతిభ కనబర్చిన ఆమెను నృత్య శిక్షకురాలు ఏలేటి అంజలి రెడ్డి, పట్టణ వాసులు అభినందించారు. సరిత ఇప్పటికే పలు చోట్ల అత్యుత్తమ ప్రదర్శనలు చేపట్టి అనేక అవార్డులు అందుకుంది.

స్వర్ణ నంది పురస్కారంతో అనంతుల సరిత

నేడు సమావేశం

ముథోల్, మార్చి 25: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు మంగళవారం ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని ఉద్యమకారుడు రోల్ల రమేశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఉద్యమకారులను తగిన గుర్తింపు ఇస్తానని మాట ఇచ్చినట్లు తెలిపారు. దీనికి ఉద్యమకారులు సమయానికి హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమానికి టీజేఏసీ జిల్లా నాయకులు వస్తున్నట్లు తెలిపారు.

వాగులో పడి ఒకరి మృతి

సారంగాపూర్, మార్చి 25 : మల్లక్ గ్రామానికి చెందిన తాండ్ర పెద్ద ఎర్రన్న(50) సోమవారం వాగులో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రన్న గ్రామ శివారులోని స్వర్ణ వాగు వద్దకు పని నిమిత్తం వెళ్లాడు. అయితే కాలుజారి ప్రమాదవశాత్తు అందులో పడిపోయి మృతి చెందాడు. మృతుని కూతురు భీమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

ఉదారత చాటుకున్న దంపతులు

జైనథ్, మార్చి 25 : కామాయి గ్రామానికి చెందిన జైనథ్ మార్కెట్ డైరెక్టర్ కేతిరెడ్డి సురేందర్ రెడ్డి పద్మరెడ్డి సోమవారం తమ మనవరాలు పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని 50 కుటుంబాలకు టిఫిన్ డబ్బాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు విష్ణు వర్ధన్ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ యూనీర్ ఆర్ఫాత్

దస్తురాబాద్,మార్చి25 : రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పోలీసులు విస్తృతంగా తనిఖీ చేపట్టారు. సోమవారం మండలంలోని గొడిసేర్యాల ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను, ద్విచక్ర వాహనాలను, కారులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించి, పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది ద్వైకర్, సురేందర్, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

తాంసి(తలమడుగు), మార్చి 25: తలమడుగు మండలం పల్లి(కే) గ్రామంలో సద్గురు శ్రీ శబరిమాత ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. శబరిమాత పల్లకీని మంగళ వాయిద్యాలతో భజన చేస్తూ, భక్తిగీతాలు ఆలపిస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

ప్రభుత్వ దవాఖానపై పట్టింపు ఏది..

దస్తురాబాద్, మార్చి 25 : దస్తురాబాద్ లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై పట్టింపు కరువైంది. ప్రభుత్వ దవాఖాన రెండు సార్లు ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. రోజుకు 100ఓపీలు వస్తుంటాయి. అభివృద్ధి మాత్రం శూన్యం. జిల్లా వైద్యాధికారులు ఎన్నో సార్లు వచ్చి వెళ్తున్న సమస్యను పరిష్కరించడం లేదు. మూడు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోడ కూలీ పోవడంతో రక్షణ కరువైంది. దీంతో పశువులు, కుక్కలు, పందులు లోపలికి రావడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అక్కడికి వచ్చిన రోగులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు,అధికారులు దృష్టి సారించి నూతన గోడ నిర్మించాలని కోరుతున్నారు.


దస్తురాబాద్ : వర్షానికి కూలీపోయిన గోడ